# వరంగల్ వాయిస్

www.warangalvoice.net

Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 325 | శనివారం | 13 జులై 2024 | పేజీలు : 08 | వెల రూ. 5


## పొదుపుతోనే ఆర్థికాభివృద్ధి



7 లో..

పద్మశాలి వర్కింగ్ జర్నలిస్టుల పరపతి సంఘం అధ్యక్షుడు నాగరాజు

ఘనంగా సంఘం సర్వసభ్య సమావేశం

# దుబారాకు చెక్ పెట్టాల్సిందే..





**అప్పుల కుప్పగా తెలంగాణ**

**కట్టడి చేయడంలో కేంద్రం విఫలం**

**పాలకులు చేసే అప్పులకు బాధ్యులెవరు**

**దిద్దుబాటు చర్యల్లో రాష్ట్ర ప్రభుత్వం**

వివరాలు 2లో..

అప్పు చేసి పప్పు కూడా అన్నట్లుగా మారింది తెలంగాణ పరిస్థితి. అభివృద్ధి మాటున గత పాలకులు చేసిన అప్పులు కుప్పలుగా మారాయి. దీంతో విభజన లక్ష్యం వెనక్కి పోయింది. ఎడాపెడా చేసిన అప్పులతో రాష్ట్రాన్ని కోలుకోకుండా చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుంది. గోబెల్స్‌ను మించి అభివృద్ధి పేరుతో అతిగా ప్రచారం చేశారు. మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణను రూ.7 లక్షల కోట్ల అప్పుల్లో ముంచారు. దుబారా పథకాలను ప్రవేశపెట్టి కోట్లు దండుకున్నారు. తాము చేసిందే అభివృద్ధి అన్నట్లుగా కలరింగ్ ఇచ్చుకున్నారు. కుప్పలుగా పేరుకుపోయిన అప్పులనుంచి ఇప్పటికిప్పుడు తెలంగాణ బయటపడడం సాధ్యం కాదు. అయితే దుబారా పథకాలకు చెక్ పెట్టడం ద్వారానైనా కొంతలో కొంతైనా ఉపశమనం పొందవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అప్పుల కుప్పలకు కేంద్రంలోని బీజేపీ కూడా ఓ కారణం అనే చెప్పవచ్చు. అప్పుల రాష్ట్రంగా తెలంగాణ మారుతున్నా చోద్యం చూసిన మోడీ ప్రభుత్వం..ఇప్పుడు నీతి వాక్యాలు పలుకుతోంది. బీజేపీ నేతలకు వేరే పనేమి లేనట్లుగా విమర్శలతో కాలయాపన చేస్తున్నారు. అప్పులు చేయకుండా రాష్ట్రాలను కట్టడి చేయడంలో కేంద్రం పూర్తిగా విఫలమైందనే చెప్పవచ్చు.

- వరంగల్ వాయిస్, వరంగల్



2లో..

## శాంతియుతంగా పండుగలు జరుపుకుందాం

వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా



8లో..

## ఎడ్యుకేషన్ హబ్‌గా ఓరుగల్లు

వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

ఘనంగా అభినందన సభ





2లో..

## గిరిజన ప్రాంత సమస్యలు పరిష్కరిస్తా..

ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలి

ప్రజా దర్బార్‌లో మంత్రి సీతక్క

# దుబారాకు చెక్ పెట్టాల్సిందే..!




**అప్పుల కుప్పగా తెలంగాణ**

**కట్టడి చేయడంలో కేంద్రం విఫలం**

**పాలకులు చేసే అప్పులకు బాధ్యులెవరు**

**దిద్దుబాటు చర్యల్లో రాష్ట్ర ప్రభుత్వం**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** అభివృద్ధి పేరుతో గత పాలకులు చేసిన ఆర్థిక విధ్వంసానికి తెలంగాణ తీవ్రంగా నష్టపోయింది. ఎవరికి వారు ఓట్ల రాజకీయాలు చేశారు. అభివృద్ధి బుత్తంత..అప్పులు కొండంత అన్నట్లుగా వారి పాలన సాగింది. పాలకుల స్వప్రయోజనాలే లక్ష్యంగా కొత్త కొత్త పథకాలకు శ్రీకారం చుట్టి దేశంలోనే ఎక్కడా లేని విధంగా అభివృద్ధి చేశామంటూ కలరింగ్ ఇచ్చుకున్నారు. అయితే పాలకులు ఇష్టానుసారం అప్పులు చేసి వెళితే దాని బాధ్యత ఎవరిదన్న చర్చ జరుగుతోంది. ప్రజలను ఆదుకోవడం వేరు..ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం పథకాలను అమలు చేయడం వేరన్న పద్ధతిలో పాలన సాగాలి. రైతుబంధు కావచ్చు...ఇతర పథకాలు కావచ్చు..దుబారాను అరికట్టాలి. దూరదృష్టి లేకుండా పథకాల పేరుతో దుబారా చేస్తే నష్టపోయేది రాష్ట్రం.. ప్రజలే అని గుర్తించాలి.

## రూ.25వేల కోట్లు వృథా..

రైతుబంధు విషయంలో ఇప్పుడిప్పుడే తెలంగాణ ప్రభుత్వం సరైన అడుగులు వేస్తోంది. అర్హులకే ఇవ్వడంతో పాటు, గతంలో అప్పనంగా రైతుబంధు సాయం పొందిన వారి జాబితాను సిద్ధం చేస్తోంది. దాదాపు రూ.25వేల కోట్లు వృథా అయినట్లు మంత్రి తుమ్మల నాగేశ్వర రావు చెబుతున్నారు. ఇలాంటి దుబారాలపై ప్రభుత్వం నిక్కచ్చిగా వ్యవహరించాల్సిందే. ఎందుకంటే ఆస్తుల మాట ఎలా ఉన్నా ఏటేటా రాష్ట్రంలో అప్పుల మూట పెరుగుతోంది. కొత్త కొత్త పథకాలతో ప్రజలకు దోచిపెడుతూ దానకర్ణుడిలా గొప్పులు చేశామని కేసీఆర్, జగన్ చాటుకున్నారు. చేతికి ఎముక లేదన్నట్లుగా పథకాలతో ఖజానాను ఊడ్చేశారు. ఇదంతా అభివృద్ధిగా చూపుతూ..దేశమంతా ఇదే పాటించాలన్న డిమాండ్‌ను పెట్టారు.

## దుబారాను అరికట్టాలి..

పేదలకు చేయూతనందించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఇచితంగానే రేషన్ బియ్యం పంపిణీ చేస్తోంది. అయితే ఈ బియ్యం పక్కదారి పడుతున్నా..కొత్తగా వచ్చిన పాలకులకు ఏమాత్రం పట్టడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ని రేషన్ కార్డులున్నాయి.. ఎంతమంది పేదలున్నారు.. ఎంతమంది పీడీఎస్ బియ్యం వాడుతున్నారన్నది గమనించడం లేదు. బియ్యం పక్కదారి పట్టి అమ్ముకుంటున్నా తమకు ఎలాంటి సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. దీనిని సమీక్షించేందుకు పాలకులకు సమయం దొరకడం లేదు. ఇలాంటి పథకాలు ప్రభుత్వాలకు గుదిబండగా మారుతున్నాయి. ఓ రకంగా చెప్పాలంటే దళారీలకు దందాలు చేసే పథకంగా మారింది. ఉచిత విద్యుత్ కూడా ఇప్పుడు ఆందోళనలకు కారణం అవుతోంది. నిజానికి రైతులకు ఎంత ఉచిత విద్యుత్ అవసరమో లెక్కలేదు. ఎవరికి ఎంత పొలం ఉంది..వారికి ఎంత విద్యుత్ అసవరం.. వారు ఏ పంటలు పండిస్తున్నారో లెక్కలు తీయాలి. ఉచిత విద్యుత్ పొందుతున్న వారిలో ఎందరు పంటలు పండిస్తున్నారు.. ఏ పంటలు పండిస్తున్నారు..అన్న లెక్కలు కూడా లేవు. కొందరు ఇతరత్రా పనులకు ఉచిత విద్యుత్‌ను ఉపయోగిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. నిజానికి ఉచిత విద్యుత్‌ను కూడా లెక్కగట్టి ఇవ్వాలి. ఏ పంట పండిస్తారో చూడాలి. ప్రజలు పన్నుల రూపంలో కట్టిన డబ్బులతో విద్యుత్ కొని ఇస్తున్నప్పుడు దానికి లెక్కా పత్రం ఉండాలి.

## పంచిపెట్టడం కాదు..

జీతాలు సకాలంలో ఇవ్వలేక, అభివృద్ధి పనులు చేపట్టలేక, ఉన్నది ఉచితంగా దోచిపెడుతూ తామేదో ఘనకార్యం చేసామనుకున్న గత పాలకుల కళ్లు తెరిపించాలి. అసవరమైతే అందుకు వారిని బాధ్యతులను చేయాలి. చేసిన అప్పులకు శిక్షలు పడేలా చేయాలి. ఇకముందు రాజకీయ పార్టీలు, నేతలు ఇలా బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించకుండా కట్టడి చేయాలి. ఇప్పటికైనా పథకాల కోసం కొత్తగా డబ్బుల వేట మొదలు పెట్టడం, అప్పులు చేయడం సరైనపని కాదని పాలకులు గుర్తించాలి. ఉన్న అప్పులను తీర్చడమెలా అన్న దానిపై దృష్టి సారించాలి. పాలన అంటే పంచిపెట్టడం కాదని గుర్తించాలి. నగదు బదిలీలతో ప్రజలను మచ్చిక చేసుకుని ఓటు బ్యాంకు రాజకీయాలు చేసే పద్ధతులు ఇకనుంచి పోవాలి. మరీ ముఖ్యంగా దుబారా పథకాలపై సవిరీక్షించాలి. ప్రజలు కూడా దోచిపెట్టినంత కాలం తింటారు. ఇబ్బడి ముబ్బడిగా పోటీపడి కొనసాగించిన ఉచిత పథకాలను రద్దు చేయాలి. రైతుబంధు, రైతు రుణమాఫీలు, ఉచిత గొర్రెల పథకం, దళితబంధు వంటి పథకాల ద్వారా లక్షల కోట్లు దుర్వినియోగం అయ్యాయి. విపక్షాలు కూడా విమర్శలు మాని ఈ పథకాలపై చర్చించి దుబారాను అరికట్టడానికి సహకరించాలి. మంచి సూచనలు ఇవ్వాలి. లేకుంటే వారు కూడా ఇందుకు బాధ్యులవుతారన్న విషయం మరువరాదు.

## అర్హులను లెక్కగట్టాలి..

ఒక్కో పథకంలో ఎంతమంది పేదలున్నారు.. అందులో ఎందరు అర్హులున్నారో లెక్కగట్టాలి. ప్రజల కష్టాలను కొంతయినా తగ్గించగలిగే నిర్ణయాలు మాత్రమే కావాలి. ప్రజలకునేరుగా డబ్బులు పందేరం అన్నది వారిని సోమరులను తయారు చేసే ప్రయత్నం మాత్రమే కాగలదు. బంగారు పళ్లెంలో అన్నం పెట్టాలని ఎవరూ కోరుకోవడం లేదు. అన్నం తినగలిగేలా, గౌరవంగా బతికేలా వారి జీవితాలకు అడ్డం పడకుండా నిర్ణయాలు తీసుకుంటే అదే మేలు. ప్రచారపు ఆర్భాటాలు కాకుండా ప్రజలు తమంతగా తాము బాగు పడ్డామని చెప్పగలిగినప్పుడే సుపరిపాలన అందించిన వారం అవుతాం. అప్పుడే ప్రజలు స్వాగతిస్తారు. ఏసీ గదుల్లో కూర్చుని నిర్ణయాలు చేయడం..అవి ప్రజలకు చేరుతున్నాయో లేదో గమనించక పోవడం సరికాదు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే విధంగా అవసరమైన కఠిన నిర్ణయాలు తీసుకుంటే మంచిది. అంతేగానీ కులాలు, మతాలు పేరుతో విభజించి పథకాలు అమలు చేయడం సరికాదు. బొక్కసం వెక్కిరించేలా చేయడం వల్ల..అప్పులు చేయడం వల్ల భవిష్యత్ తరానికి కోలుకోలేని దెబ్బ తగులుతుందని గుర్తించాలి. ఉచిత పథకాల దురదను గోకినంత సేపు హాయిగా ఉంటుంది. కానీ తరవాత వ్రణంగా మారుతందని గుర్తించాలి.



# శాంతియుతంగా పండుగలు జరుపుకుందాం

**వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా**

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** శాంతియుత వాతావరంలో పండుగలను జరుపుకుందామని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ప్రజలకు సూచించారు. మొహర్రం, తొలి ఏకాదశి రెండు పండుగలు ఒకే రోజు ఉన్నందున సెంట్రల్ జోన్ పరిధిలోని శాంతి పరిరక్షణ కమిటీలతో సీపీ శనివారం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాలకు చెందిన వివిధ మతాలకు చెందిన మత పెద్దలతో పాటు పోలీస్ అధికారులు పాల్గొన్న ఈ శాంతి పరిరక్షణ కమిటీ సమావేశంలో సీపీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఓరుగల్లు నగరంలో సోదరభావంతో పండుగలు నిర్వహించుకోవడం ప్రత్యేకమన్నారు. మతాలు ఏవైనా తమ పిల్లలను గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిసలుగా మారకుండా జాగ్రత్త పడాలని, ప్రధానంగా తమ పిల్లల కార్యకలాపాలతో, వ్యవహారశ్కెలిపై ఒక లుక్కు వేయాలన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గంజాయి నిర్మూలనకు అన్ని మతాల వారు తమ వంతు సహకరాన్ని అందించాలని సీపీ కోరారు. ఈ సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, అదనపు డీసీపీ రవి, ఏసీపీలు దేవేందర్ రెడ్డి, నందిరాం నాయక్, తిరుమల్‌తో పాటు ఇన్ స్పెక్టర్లు, మత పెద్దలు పాల్గొన్నారు.

# గిరిజన ప్రాంత సమస్యలు పరిష్కరిస్తా..

**ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలి**

**ప్రజా దర్బార్‌లో మంత్రి సీతక్క**

**వరంగల్ వాయిస్, తాడ్వాయి :** గిరిజన ప్రాంతాల్లో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరిస్తామని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. శనివారం తాడ్వాయి మండలంలోని లింగాల గ్రామంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, ఎస్పీ శబరీష్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజలతో కలిసి మంత్రి సీతక్క ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లింగాల, లవ్వల, బందాల, కొడిశాల గ్రామాలకు చెందిన ప్రజల నుంచి పోడు భూములు పట్టాలు, జీసీసీ డిపో ఏర్పాటు, రహదారులు, కరెంట్, బస్సు రవాణా వంటి సమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని, వికలాంగులకు సదరం క్యాప్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. మహిళలకు మీసేవ కేంద్రాల ఏర్పాటు, మహిళా శక్తి క్యాంటీన్ ల ఏర్పాటుపై అవగహన కల్పించి వారికి ప్రోత్సాహం అందిస్తామన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలకు పౌష్టిక ఆహారం అందించాలని అంగన్వాడీ టీచర్ లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, తాడ్వాయి మండల ప్రత్యేక అధికారి డాక్టర్ అప్పయ్య, తాసిల్దార్ రవీందర్, విద్యుత్ శాఖ, మిషన్ భగీరథ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి..



ఏజెన్సీ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి సారించామని మంత్రి సీతక్క తెలిపారు. ఐదు మారుమూల గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్న లక్ష్యంతో రాష్ట్రంలోనే తొలి కంటైనర్ ఆసుపత్రి ( ఆరోగ్య ఉప కేంద్రం) ను ఏర్పాటు చేశామని మంత్రి సీతక్క తెలిపారు. శనివారం తాడ్వాయి మండలం పోచాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన తొలి కంటైనర్ ఆసుపత్రిని మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, ఎస్పీ శబరీష్, అదనపు కలెక్టర్ పి.శ్రీజతో కలిసి ప్రారంభించారు. ఈ పీహెచ్ సీకి సుమారు రూ.7 లక్షలు ఖర్చు చేశామన్నారు. రెండు రోజుల క్రితం హైదరాబాదు నుంచి ప్రత్యేక వాహనంలో తీసుకొచ్చి పోచాపూర్ గ్రామంలో ఏర్పాటు చేశామన్నారు. ఈ కంటైనర్ ఆసుపత్రిలో అత్యవసర చికిత్స నిమిత్తం నాలుగు బెడ్స్, మందులు ఏర్పాటు చేశామన్నారు. ఒక ఏఎన్ఎం, ఒక ఆశా కార్యకర్త అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. అనంతరం పోచపూర్ లోని గురుకులంను వారు పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, పిల్లలకు అందించే ఆహారంలో నాణ్యత పాటించాలని సూచించారు.

# ప్రతి మహిళా ఒక శక్తిగా ఎదగాలి

## నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి



**వరంగల్ వాయిస్, నెక్కొండ :** మండలంలోని దీక్షకుంట్ల గ్రామంలో మహిళా కమ్యూనిటీ హాల్ ను శనివారం నర్సంపేట శాసనసభ్యుడు దొంతి మాధవరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా శక్తి పథకంలో భాగంగా ప్రతి మహిళా సంఘానికి రూ. 20 లక్షలు అందిస్తున్నట్లు ఆయన సమావేశంలో తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని, ప్రతి మహిళా ఒక శక్తి ఎదగాలని మీకు కావలసిన సహాయ సహకారాలు సకాలంలో అందిస్తామని తెలిపారు. అదే విధంగా కమ్యూనిటీ హాల్ కు సంబంధించిన వాటర్ బోర్, ఫ్లోరింగ్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి, పెండం రామానందం, నెక్కొండ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్, నర్సంపేట నెక్కొండ మార్కెట్ చైర్మన్లు పాలాయి శ్రీనివాస్, రావుల హరీష్ రెడ్డి, మహిళా జిల్లా అధ్యక్షురాలు కర్నాటి పర్వతమ్మ, నెక్కొండ పట్టణ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, బండి శివ కుమార్, జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి రాచకొండ రఘు, నెక్కొండ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సింగం ప్రశాంత్, రామాలయ కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ రావుల మైపాల్ రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు లావుడ్య తిరుమల్ చౌహన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొల్లి సుబ్బారెడ్డి, గరికపాటి హనుమంతరావు, ఈదునూరి సాయి కృష్ణ, చల్ల పాపిరెడ్డి, ఈదునూరి ప్రభాకర్, మెరుగు విజయ్, ఓబీసీ మండల అధ్యక్షుడు మాదాటి శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి బోడో ప్రవీణ్, యూత్ కాంగ్రెస్ మండల నాయకులు చిన్నూరి కార్తీక్, కొంగర దినేష్, కాంగ్రెస్ పార్టీ అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం-హెూం గార్డ్ మృతి



**వరంగల్ వాయిస్, మామునూర్ :** వరంగల్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. విధులకు హాజరయ్యేందుకు వెళ్తున్న ఓ హెూంగార్డు శనివారం తెల్లవారు జామున రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఖమ్మం జాతీయ రహదారి మామునూరు వరంగల్-జ్యోతిబా పూలే పాఠశాల ఎదురుగా ఈ ప్రమాదం జరిగింది. మామునూరు 4వ బెటాలియన్ లో విధులు నిర్వహిస్తున్న హెూంగార్డు వడ్డేపల్లి సుధాకర్ విధులకు హాజరయ్యేందుకు వెళ్తున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదలో హెూం గార్డ్ శరీరం ఛిద్రమైంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# గుట్కాలు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఎలాంటి అనుమతి లేకుండా గుట్కా అక్రమంగా విక్రయాలకు పాల్పడుతున్నారని టాస్క్ ఫోర్స్ బృందం విశ్వసనీయ సమాచారం మేరకు ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం టాస్క్ ఫోర్స్ బృందం విన్నకెడ వెంకట శివ నాగరాజ్ కుమార్ తండ్రి నెహ్రూ కుమార్, వయస్సు 42 సంవత్సరాలు అనే వ్యక్తి ఇంటిపై టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. రూ. 2,01,500 విలువ గల సొత్తును స్వాధీనం చేసుకొని నిందితులతో పాటు స్వాధీనం చేసుకున్న సొత్తును తదుపరి చర్య కోసం ఇంతేజార్‌గంజ్ పోలీసులకు అప్పగించారు. ఈ దాడిలో టాస్క్ ఫోర్స్ ఇన్ స్పెక్టర్ ఎస్.రవి కుమార్, ఎస్సై బి.శరత్ కుమార్, టాస్క్ ఫోర్స్ బృందం, ఇంతేజార్‌గంజ్ పోలీసులు పాల్గొన్నారు.

# నిరుపేదల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

## ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** రాష్ట్రంలో ఉన్న పేదలను అభివృద్ధి చేయడమే మా ప్రభుత్వం లక్ష్యమని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి అన్నారు. శనివారం తొర్రూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. పాలకుర్తి నియోజకవర్గ పరిధిలో గల వివిధ మండలాలకు చెందిన అనారోగ్యానికి గురైన వివిధ గ్రామాలకు చెందిన 185 మంది బాధితులకు మంజూరైన రూ. 49 లక్షల నాలుగు వేల రూపాయలు (49,04,000) రూ. చెక్కులను ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి లబ్ధిదారుకుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ పథకం ద్వారానే కాకుండా ఆరోగ్య శ్రీ పథకం వర్తించని వ్యాధులకు, పేదలను ఆదుకోవడం కోసం సీఎం రేవంత్ రెడ్డి లక్షల రూపాయలను మంజూరు చేస్తున్నారని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి తెలిపారు. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం రూపొందించిన పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి పిలుపునిచ్చారు. దేశంలో ఎక్కడలేని విధంగా మన రాష్ట్రంలో ప్రజాకర్షక పథకాలను రూపకల్పన చేసిన సీఎం రేవంత్ రెడ్డి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా బంగారు తెలంగాణ నిర్మాణం కోసం ముందుకు సాగుతున్నారని ఎమ్మెల్యే యశస్విని అన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి లబ్ధిదారులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళంపల్లి రామచంద్రయ్య, వైస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, బ్లాక్ అధ్యక్షులు ఆమ్యా నాయక్, రాపాక సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు సోమా రాజశేఖర్, మండల అధ్యక్షులు సుంచు సంతోష్, రవీందర్ రెడ్డి, సురేష్ నాయక్, గిరగాని కుమారస్వామి, ముద్దసాని సురేష్, నల్ల శ్రీరామ్, పట్టణ వార్డు కౌన్సిలర్లు, వివిధ గ్రామ పార్టీ అధ్యక్షులు, తాజా మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ సీనియర్ నాయకులు, లబ్ధిదారులు, తదితరులు, పాల్గొన్నారు.

# బీరన్న ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు




**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఈ నెల 17న తొలి ఏకాదశి మహా పర్వదినం సందర్భంగా జరిగే శ్రీ బీరన్న స్వామి దేవుని ఉత్సవాలకు విచ్చేయు ప్రజా ప్రతినిధులకు, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగు ఏర్పాటు చేయాలని మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ఓ పైండ్ల మల్లయ్య అన్నారు. శనివారం ఎస్ హెచ్ఓ(సీఐ) పైండ్ల మల్లయ్య ఉర్సు బీరన్న స్వామి దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవితో కలిసి దేవాలయ ప్రాంగణాన్ని పరిశీలించి తగు సూచనలు చేశారు. దేవస్థాన చైర్మన్ మరుపల్ల రవి శ్రీ బీరన్న స్వామి బోనాల జాతర జరుగు తీరును ఎస్ హెచ్ఓకు తెలియజేశారు. బోనాలు బయలుదేరు ప్రదేశం నుంచి దేవాలయం వరకు అలాగే దేవాలయంలో తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలని చైర్మన్ మరుపల్ల రవి ఎస్ హెచ్ఓ మల్లయ్యను కోరారు. శాంతి భద్రతల పరిరక్షణకు బోనాల జాతరకు తగిన బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఎస్ హెచ్ఓ తెలిపారు. మిల్స్ కాలనీ ఎస్ హెచ్ఓ మల్లయ్య ఉర్సు శ్రీ బీరన్న స్వామి దేవాలయాన్ని సందర్శించిన సందర్భంగా ధర్మకర్తల మండలి చైర్మన్ మరుపల్లరవి శాలువాతో సన్మానించారు. ధర్మకర్తలు ఏరా కోటేశ్వర్, నీల యాకయ్య, అన్న రాజేశం, మండల ప్రమీల, కోరె ఐలయ్య, మిర్యాల కుమార స్వామి, గౌడ కోటేశ్వర్, చీర రాజు, కొలుపుల కోటేశ్వర్, మరుపల్ల గౌతమ్, పూజారి బలభద్ర భాస్కర్ లతో పాటు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# ముదిరాజ్ కులస్తుల పోస్టర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రంలో శనివారం ముదిరాజ్ కులస్తులు పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల ముందు ముదిరాజులకు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా అభయహస్తం హామీలో భాగమైన ముదిరాజ్ లను బీసీ-డీ నుంచి బీసీ-ఏ కు మార్చాలని, చెరువులు, కుంటలపై ముదిరాజు లకు సంపూర్ణ హక్కులు కల్పిస్తూ చట్టం చేయాలని ఈనెల 15 నుంచి 20 వరకు తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి ముదిరాజ్ బిడ్డ పెద్ద ఎత్తున కదిలి ప్రతి మండలంలోని రెవెన్యూ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రాలు సమర్పించాలన్నారు. రాష్ట్రంలోని ముదిరాజ్ యువత బాధ్యతా యుతంగా పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు కొత్తూరు రామ్మోహన్, ముదిరాజ్ జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ అల్లాడి నర్సయ్య, వరంగల్ జిల్లా ముదిరాజ్ మహాసభ యువత ప్రధాన కార్యదర్శి గుండా రాకేష్, మండలంలోని అన్ని గ్రామల ముదిరాజ్ సొసైటీ అధ్యక్షులు, కార్యదర్శులు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మార్చురీ వాహనాలకు అడ్డాగా మానుకోట ప్రెస్ క్లబ్




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** మహబూబాబాద్ జిల్లా ప్రెస్ క్లబ్ పేరుకే ఉన్నది కానీ, ఇప్పటివరకు ఆ ప్రెస్ క్లబ్ సభ్యత్వం గాని సమావేశం గానీ కనీసం ఒక కమిటీ గాని లేదు. చిన్న చిన్న మండలాల్లో ప్రెస్ క్లబ్ ఏర్పాట్లు జరుగుతూ ఉంటే జిల్లా ఏర్పడి 8 ఏళ్లు అవుతున్నా ఇప్పటివరకు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడి ఎన్నిక ఏర్పాట్లు జరగక పోవడం శోచనీయం. గత ప్రభుత్వ హయాంలో మానుకోట ఎమ్మెల్యే శంకర్ నాయక్, అప్పటి మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ తక్కల్లపల్లి రవీందర్ సహా మాజీ ఎంపీ కవిత అందరూ ప్రెస్ క్లబ్ నిర్మాణానికి అవసరమైన నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. కానీ, దీనిపై ఇప్పటివరకు చర్చ జరగకపోవడంతో ఎవరు లబ్ది పొందుతున్నారు ...? ఎవరికి నష్టం వాటిల్లుతుంది అంటే లబ్ది గురించి ఆలోచించే విలేకరి లేదు కానీ వర్కింగ్ జర్నలిస్ట్ లకు చాలామందికి అన్యాయం జరుగుతుంది. అంతమంది ప్రజా ప్రతినిధులు నిధులు విడుదల చేస్తామని చెప్పిన ప్రెస్ క్లబ్ ఏర్పాట్లు ముందుకు కదలక పోవడం వెనుక జర్నలిస్ట్ సంఘాల నాయకుల ఐక్యతా లోపమే కారణమా.. లేక ప్రెస్ క్లబ్ అధ్యక్ష ఎన్నిక జరిగితే జర్నలిస్ట్ సంఘ అధ్యక్షుడిగా వచ్చే మామూళ్లు రావని ఎవరికి వారు దూరంగా ఉంటున్నారా...? ఇదంతా ఒకఎత్తయితేప్రెస్ క్లబ్ గురించి ఆలోచించే విలేకరి ఒకరు లేకపోవడంతో ప్రెస్ క్లబ్ జాగాలో గవర్నమెంట్ హాస్పిటల్ అంబులెన్స్, మార్చురీ వాహనాలు సహా హాస్పిటల్ కి వచ్చే పేషంట్ల వాహనాలు సైతం ఈ స్థలంలోనే పార్కింగ్ చేస్తున్నారు. ఇందుకు మరో ముఖ్యకారణం ఈ విషయంపై ప్రశ్నించే ఒక్క విలేకరి కూడా లేకపోవడం. ఇప్పటికైనా మానుకోటలో ప్రెస్ క్లబ్ అధ్యక్ష ఎన్నిక ఏర్పాట్లు చేస్తారా....? దీనికి జర్నలిస్ట్ సంఘాలు అన్ని ఒకే తాటి పైకి వస్తాయా...?ప్రతి ఒక జర్నలిస్ట్ సంఘం నాయకుడు జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడేనా..? ప్రెస్ క్లబ్ గురించి వారు ఉన్నారా...? జర్నలిస్టు సంఘ నాయకులంతా ఒక తాటిపైకి వచ్చి దీనిపై ఆలోచించాలని జిల్లా వ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులందరూ కోరుకుంటున్నారు.

# ముదిరాజ్‌ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలి

## రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ముదిరాజ్‌ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని, ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హనుమకొండ పట్టణంలోని మచిలీబజార్ తెలంగాణ ముదిరాజ్ మహాసభ కమ్యూనిటీ హాల్ లో ముదిరాజ్ మహాసభ ప్రధాన కార్యదర్శి పులి రజినీకాంత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలను అందించే కార్యక్రమాన్ని సోమవారం నుంచి చేపట్టడంతో పాటు తెలంగాణ ముదిరాజ్ మహాసభ ప్రభుత్వం ముందు పలు డిమాండ్లను నెరవేర్చాలని రూపొందించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా పులి రజినీకాంత్ మాట్లాడుతూ తెలంగాణలో అత్యంత ప్రాచీన, అధిక జనాభా గల కులమైన ముదిరాజ్/ తెనుగోళ్ళు/ ముత్తరాసి అయిన తాము సమాజంలో అన్ని రంగాలలో వెనుకబడి ఉన్నామని అన్నారు. ముదిరాజుల అభివృద్ధి కోసం ముదిరాజ్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ను ఏర్పాటుతో పాటు ప్రతి సంవత్సరానికి రూ.1000 కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. మత్స్య శాఖలోని సొసైటీలకు ఎన్నికలు జరపాలని, మత్స్యకారులకు ఆసరా పింఛన్ సౌకర్యం కల్పించాలని, ప్రత్యేక గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయాలని, ఉచిత చేప పిల్లల పంపిణీ పథకాన్ని కొనసాగించాలని, ముదిరాజ్ లకు మంత్రి వర్గంలో స్థానం కల్పించాలని కోరారు. నామినేటెడ్ పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చొప్పరి సోమయ్య, ఎన్ఆర్ఐ రాజ్‌కుమార్, పిట్టల సత్యనారాయణ, రవి కుమార్, మహేందర్, బయ్య శోభన్, పులి మధు, కుమారస్వామి, సారంగపాణి, సాంబమూర్తి, విక్రమ్, బుచ్చిరాజు, సదానందం, హరికృష్ణ, ప్రకాశ్, సమ్మయ్య, సాంబయ్య, వెంకటస్వామి, రవీందర్, మహేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

# విద్యార్థులకు సంపూర్ణమైన విద్యను అందించాలి

## పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క



**వరంగల్ వాయిస్, గోవిందరావుపేట :** విద్యార్థులకు సంపూర్ణమైన విద్యను అందించాలని, విద్యార్థులు విద్యతో పాటు సమాజంపై కూడా అవగాహన పెంచుకోవాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. శనివారం గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామంలో రూ.135.00 లక్షల సమగ్ర శిక్ష నిధులతో నూతనంగా నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ తరగతి గదుల, వసతి భవనాన్ని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులకు అన్ని ఏర్పాట్లు , సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. పదవ తరగతి నుంచి కస్తూర్బా గాంధీ పాఠశాలలను అప్ గ్రేడ్ చేసి ఇంటర్మీడియట్ విద్య అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇలాంటి అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి చదువు ఒక్కటే మార్గమని విద్యార్థులకు సూచించారు. ప్రతి టీచర్ ఒక విద్యార్థి అని నూతన పరిజ్ఞాన అంశాలను నేర్చుకొని విద్యార్థులకు బోధించాలన్నారు. టీచర్ ప్రవర్తన విద్యార్థులపై ఉంటుంది కాబట్టి, టీచర్లు విద్యార్థులకు ఆదర్శప్రాయంగా నిలవాలని సూచించారు. విద్యార్థులను అనుమతి లేకుండా బయటికి పంపకూడదని విద్యాలయ అధికారులను ఆదేశించారు.గ్రౌండ్ లేవలింగ్, బోర్స్ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, జీసీడీవో రమాదేవి, గోవిందరావుపేట తహసీల్దార్ సృజన్ కుమార్, కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల ఎస్ఓ వెంకటలక్ష్మి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# వ్యవసాయ కార్మిక సమగ్ర సంక్షేమ చట్టం కోసం పోరాడాలి

## తాటిపాముల వెంకట్రాములు




**వరంగల్ వాయిస్, వరంగల్ :** వ్యవసాయ కార్మిక సమగ్ర సంక్షేమ చట్టంతో పాటు డిమాండ్ల సాధన కోసం పోరాటాలకు సిద్ధం కావాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు పిలుపునిచ్చారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నవెంకట్రాములు ప్రసంగిస్తూ ఢిల్లీలో ఈనెల 10, 11 తేదీలలో జరిగిన జాతీయ కార్యవర్గ సమావేశం దేశవ్యాప్తంగా వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వ విధానాలపై చర్చించిందని, ఎస్సీ ఎస్టీ బీసీ మహిళలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చిందన్నారు. గత పదేళ్లుగా మోడీ ఏకపక్ష నిర్ణయాలతో కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను చవిచూసిన ప్రజలు పార్లమెంటు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. ఇప్పటికైనా మోడీ ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. వ్యవసాయ కార్మిక సమగ్ర సంక్షేమ చట్టాన్ని పార్లమెంట్ లో ఆమోదించాలని, కేంద్ర బడ్జెట్ లో గ్రామీణ ఉపాధి హామీ పథకానికి రూ.2లక్షల70 వేల కోట్లు కేటాయించి సంవత్సరంలో 200 రోజులు పనులు కల్పించి, రోజుకు రూ.700 కూలి ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలను అమలు పరచాలని వ్యవసాయ కార్మికులకు 12వేల రూపాయలు ఇవ్వాలని ,పేదల గుడిసెలకు పట్టాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించాలని, మహిళలకు నెలకు రూ.2500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. మునిగాల భిక్షపతి సమావేశానికి అధ్యక్షత వహించగా సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, బీకేఎంయూ జాతీయ సమితి సభ్యులు మోతె లింగారెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు మద్దెల ఎల్లేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె లక్ష్మణ్, బొట్టు భిక్షపతి, బండ్లోజు రాజమణి తదితరులు పాల్గొన్నారు.

# శాట్ చైర్మన్‌ను అభినందించిన డీవైఎస్ఓ

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కె. శివసేనా రెడ్డిని హనుమకొండ జిల్లా క్రీడలు యువజన అధికారి గుగులోతు అశోక్ కుమార్ అభినందించారు. ఈ మేరకు హైదరాబాదులోని గచ్చిబౌలి స్టేడియంలో శనివారం శివసేన రెడ్డి శాట్ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టారు. శివసేనా రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో క్రీడారంగం అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.




# విద్యుత్ షాక్‌తో ఆవు మృతి



**వరంగల్ వాయిస్, కేసముద్రం :** మండలంలోని రంగాపురం శివారులో అటవీ ప్రాంతంలో విద్యుదాఘాతంతో రాజీవ్ నగర్ తండా లకావత్ రెడ్యాకు చెందిన ఆవు మృతి చెందింది. కేసముద్రంలో శనివారం రెడ్యా తెలిపిన ప్రకారం శు క్రవారం తన పశువుల మందను అటవీ ప్రాంతంలో మేపుకొని తిరిగి వస్తుండగా సాయంత్రం 6 గంటల ప్రాంతంలో తెగిపడిన విద్యుత్ వైర్ ను ఆవు తొక్కడంతో విద్యుత్ షాక్ కు గురై కింద పడిపోయింది. వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం అందించడంలో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయిన అనంతరం వెళ్లి చూడగా ఆవు అప్పటికే మృతి చెందింది. మృతి చెందిన ఆవు విలువ రూ.40వేలు ఉంటుందని ఆయన తెలిపారు. నిరుపేద గిరిజనుడైన తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

# బీఆర్ నగర్‌లో హెల్త్ క్యాంప్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని 32వ డివిజన్ లోని అర్బన్ హెల్త్ సెంటర్ ఎస్ఆర్ఆర్ తోట వారి ఆధ్వరంలో బీఆర్ నగర్ లో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ పల్లం పద్మ రవి పాల్గొని మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు డెంగీ, మలేరియా, విషజ్వరాలు బారిన పడకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా స్లమ్ ఏరియాలో నివసిస్తున్న ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనిత, మోహన్ రావు, కృష్ణవేణి, సరూప తదితరులు పాల్గొన్నారు.

# జంగాకు శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నేతలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** టేకులగూడెంలో తెలంగాణ స్టేట్ ఆయిల్ సీడ్స్, గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి నివాసంలో ఆయన్ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వరదరాజేశ్వరరావు, పీసీసీ జనరల్ సెక్రెటరీ నమిండ్ల శ్రీనివాస్, పాలకుర్తి, జనగామ, గణపురం, హనుమకొండ, వర్ధన్నపేట, నియోజకవర్గం కార్యకర్తలు, నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# బాధితులకు ఫోన్లు అప్పగింత



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గత నెలలో మొబైల్ ఫోన్స్ పోగొట్టుకున్న బాధితులకు CEIR PORTAL ద్వారా ట్రేస్ అవుట్ చేసి శనివారం 14 మొబైల్స్ ను వరంగల్ ఏసీపీ బి.నందిరామ్, మట్టెవాడ సీఐ టి.గోపిలు బాధితులకు అందజేశారు. గతంలో కూడా 80 మొబైల్స్ ను ట్రేస్ అవుట్ చేసి బాధితులకు ఇవ్వటం జరిగింది. ఇందులో కొన్ని మొబైల్స్ ఇతర రాష్ట్రాల (బీహార్) నుంచి కూడా తెప్పించారు. కాబట్టి, ప్రజలందరికీ తెలియజేయునది ఏమనగా ఇలాంటి మొబైల్ మిస్సింగ్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ ఏమైనా సందర్భాలలో మీ మొబైల్ ఫోన్స్ పోయినట్లయితే CEIR పోర్టల్ లో అప్లై చేసి వెంటనే పోలీస్ స్టేషన్ కు వచ్చి సంప్రదించాలని సూచించారు.

# రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన బాడ్మింటన్ క్రీడాకారులు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** హైదరాబాద్ ఏ-జోన్ బాడ్మింటన్ అకాడమీలో జులై 14 నుంచి 17 వరకు జరిగే యోనేక్స్ బాడ్మింటన్ పదో తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాడ్మింటన్ ఛాంపియన్ షిప్ అండర్-15 బాలుర, బాలికల విభాగంలో టోర్నమెంట్ కు జీడబ్ల్యూఎంసీ బాడ్మింటన్ ప్లేయర్స్ శ్రీచేతన్ శౌర్య, అమృత రావ్, సాయి సత్య, జస్ప్రీత్, మనస్విని, మరియుమ్ ఎంపికైయ్యారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారులను జీడబ్ల్యూఎంసీ స్పోర్ట్స్ డైరెక్టర్ శంకర్ లింగం, బాడ్మింటన్ కోచ్ మాడిశెట్టి శ్రీధర్ అభినందించారు.

వరంగల్ వాయిస్ Evening Daily
శనివారం 13, జులై 2024
www.warangalvoice.net

# ప్రజా పాలన సేవా కేంద్రాల తనిఖీ

**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** వర్ధన్నపేట మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజా పాలన సేవా కేంద్రాలను జిల్లా కలెక్టర్ శనివారం ఆకస్మికంగా సందర్శించి చేస్తున్న దరకాస్తుల నమోదు , సవరణను పరిశీలించారు. మున్సిపల్ పరిధిలో ఉన్న ప్రజలకు ఉచిత విద్యుత్ మరియు గ్యాస్ సబ్సిడీ కి లబ్ది అందని ప్రజలు ఇచ్చిన దరఖాస్తులు తీసుకుని ఎప్పటికప్పుడు ఆన్ లైన్ నందు నమోదు చేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని మున్సిపల్ అధికారులకు సూచనలు చేశారు. ఇప్పటివరకు వరకు స్వీకరించిన దరఖాస్తులను తనిఖీ చేసి నమోదు చేసిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి మొక్కల పంపిణీలో కలెక్టర్ పాల్గొని ప్రజలకు మొక్కలను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ అంగోతు అరుణ,మండల తహశీల్దార్ విజయ్ సాగర్,





మున్సిపల్ కమీషనర్ ఇ. జోనా మరియు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల, జూనియర్ కాలేజీ సందర్శన..

జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఖిలా వరంగల్ మండలంలోని జక్కలుద్ది తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల, జూనియర్ కాలేజీని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, కంప్యూటర్ గదిని, వంట శాలలను పరిశీలించారు. తరగతి గదిలోకి వెళ్లి సబ్జెక్ట్ ల వారిగా విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. విద్యార్థులు చెప్పిన సమాధానంపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. జక్కలొద్ది నుంచి పాఠశాలకు రహదారి బాగులేనందున రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట ప్రిన్సిపాల్ భిక్షపతి, తదితరులు ఉన్నారు.

# రైతులపై దాడి చేసిన గుమస్తాపై చర్యలు తీసుకోవాలి




**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఆరుగాలం ఎండనక వాననక పంటలు పండిస్తూ దేశ ప్రజలకు అన్నం పెడుతున్న రైతులపై వరంగల్ లక్ష్మీపురం కూరగాయల మార్కెట్ లో రైతులపై దాడి చేయడం అమానుషమని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమీడి శ్రీనివాస్ అన్నారు. లక్ష్మీపురం వరంగల్ కురగాయల మార్కెట్ లో రైతులపై దాడి చేసిన గుమస్తా పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు నిత్యం లక్ష్మీపురం కూరగాయల మార్కెట్ కు రోజువారీగా వస్తున్నట్లుగానే కూరగాయలు అమ్ముకోవడానికి శనివారం రాత్రి మూడు గంటలకు మార్కెట్ కు కూరగాయలు తీసుకురాగా షాప్ నంబర్ 38లో పనిచేస్తున్న గుమస్తా సునీల్, రంజిత్, వినోద్ వీరితో పాటుగా మరికొందరు రైతులు సయింపు వెంకటేశ్వరరావు గ్రామం అనంతరం, గీసుకొండ మండలం, సిరుల రవీందర్ గ్రామం వంజరపల్లి, వీరిని విపరీతంగా కొట్టడం జరిగింది. ఈ సంఘటన ఉద్దేశించి తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమీడి శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటను ఎక్కడైనా స్వేచ్ఛగా అమ్ముకునే విధంగా ఉండాలని ప్రభుత్వాలు ఓ పక్కన చెప్తుంటే మరో పక్కన రైతులు స్వేచ్ఛగా పంటను అమ్ముకోకుండా భయాందోళనకు గురిచేస్తూ పంటను తక్కువ ధరకు అమ్ముకునే విధంగా మార్కెట్ లో రైతులను పెట్టుబడి దారులు మోసం చేయడం జరుగుతుందన్నారు. ఈ రైతులపై దాడి చేసిన వ్యక్తులను వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకొని రైతులపై దాడి చేసిన వారిపై పీడీ యాక్ట్ పెట్టి మరి ఏ రైతుపై దాడి చేయకుండా ప్రభుత్వం చూసే విధంగా స్వేచ్ఛగా పంటను అమ్ముకునే విధంగా సదుపాయాలు వరంగల్ లక్ష్మీపురం కూరగాయల మార్కెట్ లో ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులను ఈ సందర్భంగా కోరడం జరిగింది. వీరిపై ఇంతజార్ గంజ్ పోలీస్ స్టేషన్ లో రైతులు నేడు వారిపై ఫిర్యాదు చేశారు. రైతులకు న్యాయం చేయకపోతే పెద్దఎత్తున రైతాంగాన్ని కదిలించి రైతులకు న్యాయం జరిగే విధంగా పోరాటాన్ని కొనసాగిస్తామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు జిల్లా కార్యదర్శి ఓదెల రాజయ్య బాధ్యులు సిరుల రవీందర్, సయింపు వెంకటేశ్వరరావు, రాంబాబు, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** త్రిచక్ర పొదుపు సొసైటీ లిమిటెడ్ సభ్యులు హనుమకొండ లస్కర్ సింగర్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ సాజిద్ ఖాన్ గుండె పోటుతో మరణించారు. త్రిచక్ర సొసైటీ కమిటీ సభ్యులు ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు దహన సంస్కారాల నిమిత్తం రూ. 10వేల ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా త్రిచక్ర సొసైటీ అధ్యక్షుడు ఇసంపెల్లి సంజీవ మాట్లాడుతూ త్వరలోనే సొసైటీ గౌరవ అధ్యక్షుడు మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ భాస్కర్ సహకారంతో లక్ష రూపాయల బీమాను కూడా అందజేయడం జరుగుతుందన్నారు. అతని కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటూ కుటుంబం కష్ట సుఖాలలో వినయ్ భాస్కర్ మేము ఎప్పుడూ అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో త్రిచక్ర పొదుపు సొసైటీ లిమిటెడ్ ప్రధాన కార్యదర్శి మంద శ్రీధర్ రెడ్డి, డైరెక్టర్స్ జిలుకర స్వామి, గుండా రమేష్, నాయకులు ఎండీ.అంకుశావళి, ఎండీ యాసిన్, అల్లావుద్దీన్, ఇక్బాల్, సర్వర్, తదితరులు పాల్గొన్నారు.

# వైద్యుల నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ప్రైవేటు ఆస్పత్రుల్లో రోగుల ప్రాణాలు పిట్టల్లల రాలిపోతున్నాయి. వైద్యుల నిర్లక్ష్యంతో వందల కొద్ది ప్రాణాలు పోతున్నాయి. వైద్యం వికటించి 12 ఏళ్ల బాలుడు మృతి చెందిన సంఘటన శనివారం జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. బాలుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం. డోర్నకల్ మండలం బూర్గుపాడ్‌కు చెందిన కొత్త రాంబాబు-ప్రియ దంపతుల కుమారుడు తనీష్ (12) వరిబీజం సమస్యతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని ఓప్రైవేట్ ఆస్పత్రికి వైద్యం కోసం వచ్చాడు. వైద్యుల సలహా మేరకు కుటుంబసభ్యులు సర్జరీ చేయించారు. కానీ, ఆ వైద్యం కాస్త వికటించి పరిస్థితి విషమించింది. హుటాహుటిన వైద్యుడు మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని వేరే ప్రైవేటు ఆస్పత్రికి అంబులెన్స్ లో తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందాడు. చేతికొచ్చిన కొడుకు చనిపోయాడని ఆ తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. మృతుడి బంధువులు పెద్ద ఎత్తున ఆస్పత్రి ఎదుట ధర్నా చేశారు. పోలీసులు వచ్చి న్యాయం చేసేలా చూస్తామని గొడవను సద్దుమణిగించారు.

# కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకుడు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గ్రేటర్ వరంగల్ పరిధిలోని 2వ డివిజన్ గుండ్ల సింగారానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు గడిపి జీవన్ శనివారం హనుమకొండ సుబేదారి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వర్ధన్నపేట శాసనసభ్యుడు, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ మండల అధ్యక్షుడు మాదాసి అజయ్, 2వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు గాదె రాజయ్య, సోషల్ మీడియా వర్ధన్నపేట సోషల్ మీడియా ఇంచార్జి పుట్ట తిరుపతి, యూత్ అధ్యక్షుడు మాదాసి దయాకర్, స్థానిక మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విజ్ఞానయాత్రలతో విద్యార్థులకు లోకానుభవం

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** విద్యార్థులు పాఠ్య గ్రంథాలలో చదివిన వివిధ అంశాలను ప్రత్యక్షంగా చూసి విజ్ఞనాన్ని పెంచుకునేందుకు విజ్ఞాన యాత్రల దోహదపడటమే కాకుండా విశేషమైన లోకానుభవం కలుగుతుందని పలువురు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్దులు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని లక్నవరం, రామప్ప అలయాన్ని సందర్శించేందుకు స్కూల్ టీచర్లతో కలిసి విజ్ఞాన, విహర యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్దులను ఉద్దేశించి టీచర్లు మాట్టాడుతూ వివిధ ప్రాంతాలలోని జీవన విధానం, భాషలు, వేషధారణ, ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు తెలుసుకునేందుకు విజ్ఞాన యాత్రల దోహదపడుతాయన్నారు. విజ్ఞాన యాత్రల వల్ల మేధో వికాసం, వ్యక్తిత్వ వికాసం వంటివి సమకూరుతాయని దేశభక్తి పెంపొందుతుంది, జాతీయతా భావం, మానవీయ అనుబంధాలు, చరిత్ర, సంస్కృతి, పర్యావరణ శాస్త్ర జ్ఞానం, మేధో వికాసం, వ్యక్తిత్వ వికాసం వంటివి కలుగుతుందన్నారు. కాకతీయుల కళా వైభవానికి ప్రతీకైనా రామప్ప ఆలయం యునెస్కో గుర్తింపు రావడం ఉద్యోగ పోటీ పరీక్షల్లో సైతం రామప్పకు సంబంధించిన ప్రశ్నలు వస్తుండటంతో యువత విద్యార్థులు సందర్శనకు రావాలన్నారు. కాకతీయల కళావైభావానికి ప్రతికైన రామప్పలయం ఆధ్యాత్మిక పర్యాటక విజ్ఞాన భాండాగారంగా మారిందన్నారు. దేవాలయంలో రామాయణం మహాభారతంలోని కథలను తెలిపేలా ఒక క్రమ పద్ధతిలో చెక్కిన శిల్పాలు ఎంతో అద్భుతంగా ఉన్నాయని వివరించారు. క్షీర సాగర మదనం, నరకాసుర వధ గోపిక వస్త్రపహరణం, నరకాసుర, మన్మధ, సంహారం, దక్షయజ్ఞం, దక్ష



త్రిపురసుర సంహారం, శివపార్వతుల కళ్యాణం, ముసల తపస్సు లాంటి చరిత్ర శిల్పా రూపంలో కళ్లకు కట్టినట్లు ఉంది. ఇంత దగ్గరగా ఉన్న ఈ ప్రదేశాన్ని ఇన్ని రోజులు ఎందుకు చూడలేదు అనిపిస్తుంది. శిల్పాలు నిజంగా ప్రాణం ఉన్నట్లు ఉన్నాయని టీచర్ల విద్యార్దులకు వివరించారు. పుస్తకాల్లో చదవడంతో పాటు ప్రత్యక్షంగా చూసినట్లయితే వారితో చిరస్థాయిగా గుర్తుండిపోయే చరిత్రకు సంబంధించిన అంశాలు ప్రత్యక్షంగా తెలుసుకోవడం విజ్ఞాన విహారయాత్రల వల్ల సాకారమౌతుందన్నారు. యాత్రలో పాఠశాల ప్రదానోపాద్యాయులు బండి నర్సహింహ రావు, దయయంతి, అనిత గ్రేస్, కృపా కాంతా, వసంత రాణి, అమీనా, సమిత, ముంజులతా, భవానీ శ్రీనివాస్, అప్పిరెడ్డి, శంకరయ్య, శంకర్, సాయబ్ అలీ, రవి కుమార్, సీతారాముల, ఫహీమ్, సురేష్ బాబు తదితరుల పాల్గొన్నారు.

# గౌడ కమ్యూనిటీ హాల్‌కు రూ.5లక్షలు



**వరంగల్ వాయిస్, కేసముద్రం :** మండలంలోని ఇంటికన్నెలో నిర్మించే గౌడ సంఘం కమ్యూనిటీ హాల్ కు రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర రూ.5లక్షల ఆర్థిక సహాయాన్ని హైదరాబాద్‌లో శనివారం సంఘం బాధ్యులకు అందజేశారు. గౌడల అభ్యున్నతికి తోడ్పడుతానని రవిచంద్ర అన్నారు. ముంజ కుమారస్వామి, చిర్ర శ్రీధర్, నలమాస సందీప్, గంధసిరి శ్రీనివాస్, కారుపోతుల యాకయ్య పాల్గొన్నారు.



# పొదుపుతోనే ఆర్థికాభివృద్ధి

**పద్మశాలి వర్కింగ్ జర్నలిస్టుల పరపతి సంఘం అధ్యక్షుడు నాగరాజు**

**ఘనంగా సంఘం సర్వసభ్య సమావేశం**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** పొదుపుతోనే ఆర్థికాభివృద్ధి సాధ్యమన్న విషయాన్ని పరపతి సంఘాలు రుజువు చేస్తున్నాయని పద్మశాలి వర్కింగ్ జర్నలిస్టుల పొదుపు, పరపతి పరస్పర సహాయక సహకార సంఘం లిమిటెడ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు అన్నారు. మనం అభివృద్ధి చెందడంతోపాటు మన తోటి వారు కూడా అభివృద్ధి చెందేలా ఇవి ఎంతగానో దోహదపడుతున్నాయన్నారు. పద్మశాలి వర్కింగ్ జర్నలిస్టుల పరపతి సంఘం సర్వసభ్య సమావేశం శనివారం హంటర్ రోడ్డులోని ది వీవర్స్ వెల్ఫేర్ బోర్డు భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేముల నాగరాజు మాట్లాడుతూ సభ్యుల సలహాలు, సూచనలను పరిగణలోకి తీసుకొని రానున్న తొమ్మిది నెలల్లో సంఘం లావాదేవీలను స్ట్రీమ్ లైన్ చేయడంతో పాటు రానున్న ఐదో వార్షికోత్సవంలో పూర్తి స్థాయి వార్షిక నివేదికను సమర్పిస్తామన్నారు.



సంఘం ఉపాధ్యక్షులు, వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి మాట్లాడుతూ సంఘం పురోభివృద్ధిలో పద్మశాలి జర్నలిస్టులందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అప్పుడే సంఘం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. నాలుగు సంవత్సరాలపాటు నిర్వహించిన లావాదేవీలపై సంఘం ప్రధాన కార్యదర్శి వల్లాల వెంకటరమణ కార్యదర్శి నివేదిక ద్వారా వివరించారు. 68మంది సభ్యులతో రూ.17.34లక్షల టర్నోవర్ తో సంఘం దినదినాభివృద్ధి చెందుతుందన్నారు. దీనిపై సభ్యుల సలహాలను, అభిప్రాయాలను తీసుకున్నారు. డిఫాల్టర్ల విషయంలో కఠినంగా వ్యవహరించడంతోపాటు సంఘానికి ఆర్థిక అబ్ధి చేకూరేలా సంఘం ప్రతినిధులు కృషి చేయాలన్న అభిప్రాయం వ్యక్తం అయింది. ఈ సందర్భంగా పలు ఆర్థిక లావేదీవీలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు కోశాధికారి వేముల సదానందం సమాధానం చెప్పారు. పాలకవర్గం కొంత కఠినంగా ఉంటేనే ఆర్థిక పురోగతి సాధ్యమని భావించిన పెద్దలు పలు తీర్మాణాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.

## తీర్మానాలు..

1. సభ్యుడు తమ చిట్టీ డబ్బులను ప్రతి నెల 14, 15 తేదీల్లో కోశాధికారికి చెల్లించి రసీదు పొందాలని తీర్మాణించారు. డబ్బులు చెల్లించడంలో ఆలస్యమైతే రోజుకు రూపాయికి ఐదు పైసల చొప్పున అపరాదరుసుము వసూలు చేయాలని నిర్ణయించారు. మూడు నెలలు వాయిదాలు చెల్లించడంలో విఫలమైతే సభ్యత్వం రద్దు చేసేందుకు కమిటీకీ పూర్తి అధికారం ఉంటుంది.
2. అప్పుకోరు వారికి రూ.50వేలు లోన్ మంజూరు చేసేలా తీర్మాణించారు. దీనిని 25 కిస్తీల్లో చెల్లించాల్సి ఉంటుంది.
3. కొత్తగా చేరే అభ్యర్థులనుంచి గుడ్ విల్ గా రూ.4,500లతోపాటు సభ్యుడి వాటాధనం రూ.25,500 (జులై వరకు) మొత్తం రూ.30వేలుగా నిర్ణయించడమైంది. ఇందులో తొలుత రూ.5,000 చెల్లించి సభ్యత్వం పొందాల్సి ఉంటుంది. మిగిలిన రూ.25 వేలను కిస్తీల రూపంలో చెల్లించాల్సి ఉంటుంది.
4. పద్మశాలి వర్కింగ్ జర్నలిస్టుల పొదుపు, పరపతి పరస్పర సహాయక సహకార సంఘం లిమిటెడ్ పేరులో 'గృహ నిర్మాణ'అనే పదాన్ని కూడా చేర్చేలా తీర్మాణించారు.
5. సంఘం అకౌంట్స్ బాధ్యతలను సీనియర్ జర్నలిస్ట్, వరంగల్ వాయిస్ నెట్ వర్క్ ఇంచార్జి సామల సూర్య ప్రకాశ్, ఆంధ్రజ్యోతి విలేఖరి వడిచర్ల శ్రీనివాస్ కు అప్పగిస్తూ తీర్మాణించారు.













## సన్మానోత్సవం..

పద్మశాలి కులానికి చెందిన జర్నలిస్టులు కదం తొక్కారు. వరంగల్ నగరానికి చెందిన వీరంతా ఒక్కటైనారు. పద్మశాలి జర్నలిస్టులంతా తమ ఐక్యతను ప్రదర్శించారు. ఒకరికొకరు కుశల ప్రశ్నలు వేసుకొని ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. ఐక్యత, సంఘటితతంతో ముందుకు వెళ్తామని ప్రతినబునారు. ఈ సందర్భంగా వరంగల్ పద్మశాలి వర్కింగ్ జర్నలిస్టుల పొదుపు మరియు పరపతి పరస్పర సహాయక సహకార సంఘం ఆధ్వర్యంలో పలువురు ప్రముఖులను ఘనంగా సన్మానించారు. వేముల నాగరాజు నేతృత్వంలో వరంగల్ నగరానికి చెందిన ప్రముఖ వైద్యులు గుండేటి రమేష్, కూరపాటి రమేష్, దోమల మహేశ్వర్, కూరపాటి మధులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. అలాగే జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ సాంబారి సమ్మారావు, కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ గడ్డం భాస్కర్, తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు, పోపా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్, పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వద్నాల నరేందర్, వరంగల్, హనుమకొండ జిల్లాల పద్మశాలి సంఘ అధ్యక్షులు ఆడెపు రవీందర్, బచ్చు ఆనందం, ప్రధాన కార్యదర్శి కేదాశి వెంకటేశ్వర్లతో పాటు నగరానికి చెందిన పలువురు సీనియర్ జర్నలిస్టులను ఈ సందర్భంగా సన్మానించారు. పద్మశాలి జర్నలిస్టుల పరపతి సంఘం అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి వల్లాల వెంకటరమణ, కోశాధికారి వేముల సదానందం, వడిచెర్ల శ్రీనివాస్ చేస్తున్న సేవలను సీనియర్ జర్నలిస్టులు గడ్డం కేశవమూర్తి, మెండు రవీందర్, సామల సూర్య ప్రకాష్, అలువాల సదాశివుడు, బండారి ప్రమోద్, చెరుకు వేణు ప్రసాద్, బత్తుల సత్యం, బేతి అశోక్ బాబు, నరేష్ కుమార్, మేరుగు అశోక్, మేరుగు ప్రతాప్ తదితరులు కొనియాడారు. రానున్న రోజుల్లో పరపతి సంఘాన్ని మరింత పటిష్టం చేసేలా వ్యూహ రచన చేశారు.







# ఎడ్యుకేషన్ హబ్‌గా ఓరుగల్లు

## వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

### ఘనంగా అభినందన సభ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఓరుగల్లును ఇండస్ట్రియల్ కారిడార్, ఎడ్యుకేషన్ హబ్ గా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. మడికొండ, సత్య సాయి కన్వెన్షన్ హాల్ లో వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన అభినందన సభకు వరంగల్ ఎంపీ కడియం కావ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు కడియం కావ్యను గజ మాలతో సత్కరించారు. అనంతరం కడియం కావ్య మాట్లాడుతూ ఓరుగల్లు కోట నుంచి ఎర్రకోటకు తనను పంపించేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. మీ ఇంటి ఆడబిడ్డగా ఆశీర్వదించి పార్లమెంట్ ఎన్నికల్లో అధిక మెజారిటీతో గెలిపించిన వర్ధన్నపేట ప్రజలకు ఋణపడి ఉంటానన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామ గ్రామాన కాంగ్రెస్ జెండా ఎగరవేసే విధంగా ప్రతీ ఒక్క కార్యకర్త సైనికుడిలా పని చేయాలన్నారు. నరేంద్ర మోడీ ఓటమి భయంతో పాలన సాగిస్తున్నారని విమర్శించారు. పాలనలో కాళ్లు విరిగిన మోడీ ఒక వైపు నితీష్ కుమార్ మరో వైపు చంద్రబాబు చేతి కర్రల సహాయంతో నడుస్తున్నారని ఎద్దేవా చేశారు. రానున్న రోజుల్లో కేంద్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. వరంగల్ స్మార్ట్ సిటీ పనుల గడవు మరికొంత కాలం పెంచాలని సీఎం రేవంత్ రెడ్డితో కలిసి కేంద్రాన్ని కోరడంతో గడువు పెరిగిందని తెలిపారు. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి నాయకత్వంలో పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, మాజీ ఎంపీ పసునూరి దయాకర్, కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, రాష్ట్ర ఆయిల్ సీడ్స్ సంస్థ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రో పాషా, హనుమకొండ జిల్లా కిసాన్ అధ్యక్షులు వెంకట్ రెడ్డి, వరంగల్ జిల్లా కిసాన్ అధ్యక్షులు దేవేందర్, ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.




### రైల్వే జాక్ రౌండ్ టేబుల్ సమావేశం..

కాజీపేట రైల్వే కమ్యూనిటీ హాల్ లో తెలంగాణ రైల్వే ఉద్యోగుల జాక్ రౌండ్ టేబుల్ సమావేశం శనివారం ప్రారంభమైంది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్ పూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి హాజరై ప్రసంగించారు. ఈ సమావేశంలో రైల్వే జాక్ సభ్యులతోపాటు వర్ధన్నపేట శాసన సభ్యులు కేఆర్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



## ఎనిమిదో రోజు శాకంభరి ఉత్సవాలు

వరంగల్ మహా నగరంలోని ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళి దేవస్థానంలో నిర్వహిస్తున్న శాకంభరి ఉత్సవాలు శనివారం ఎనిమిదో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా భద్రకాళి అమ్మవారిని ఉదయం ఉగ్రమాతగా, సాయంత్రం శివదూతీమాతగా అలంకరించి పూజలు నిర్వహించారు. భద్రకాళి వేదస్థానం కార్యనిర్వహణాధికారి కె.శేషు భారతి, ప్రధానార్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకు తగిన చర్యలు తీసుకున్నారు. - వరంగల్ వాయిస్, వరంగల్



## మూగబోయిన గడియారం

నిజాం కాలంలో నిర్మించిన కలెక్టర్ బంగ్లాకు ఎంతో చరిత్ర ఉంది. బాటసారులకు ఉపయోగార్థం ఆనాటి కాలంలో ఏర్పాటు చేసిన గడియారం ఇప్పటికీ కాలాన్ని చూపిస్తూనే ఉంది. గతంలో ఈ గడియారం ప్రతినిత్యం ఉదయం ఐదు గంటలకు 'ఓం జయ జగదీశ హరే' అనే భక్తి పాటతో ప్రజానికాన్ని మేలుకొల్పేది. ఆ తరువాత ప్రతి గంటకు అప్పటి కాలాన్ని బట్టి అన్ని గంటలు కొడుతూ నగర ప్రజలకు సమయాన్ని గుర్తు చేసేది. ఈ గంటల శబ్దం రద్దీ సమయాల్లో సుమారు అర కిలోమీటర్ దూరం, నిశ్శబ్దంగా ఉన్న రాత్రి సమయాల్లో సుమారు రెండు కిలోమీటర్ల దూరం వరకు వినిపించేవి. అయితే ఈ గడియారానికి ఏమైందో ఏమో తెలియదు కానీ గత నెల రోజులుగా మూగబోయింది. సమయాన్ని చూపిస్తున్నా గంటలు కొట్టడం మాత్రం మానేసింది. ఉదయాన్నే ఆర్ట్స్ కళాశాల మైదానానికి వాకింగ్ వెళ్లే సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ ఈ విషయాన్ని గమనించి పత్రికా ముఖంగా అధికారులకు ఈ సమస్యను పరిష్కరించి గడియారానికి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. - వరంగల్ వాయిస్, హనుమకొండ

# కేయూ వసతి గృహంలో ఊడిన పెచ్చులు

### ఆందోళనకు దిగిన విద్యార్థులు






**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయ హాస్టల్‌లో సీలింగ్ ఫ్యాన్ ఊడిపడిన విషయం మరువక ముందే మరో ఘటన చోటుచేసుకున్నది. వర్సిటీలోని పోతన ఉమెన్స్ హాస్టల్‌లోని రూమ్ నెంబర్ 94లో శుక్రవారం అర్ధరాత్రి స్లాబ్ కుప్పకూలింది. అయితే ఆ సమయంలో గదిలో ఎవ్వరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటపై విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్‌లో ఉండాలంటే ప్రాణాలవిరీదికి వస్తున్నదని, ఎన్నిసార్లు వర్సిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా లాభం లేకుండా పోతున్నదని చెప్పారు. హాస్టల్ వార్డెన్‌ను నిలదీశారు. పైకప్పు ఊడిన ఘటనపై విద్యార్థులు ఆందోళనకు దిగారు. రాణిరుద్రమదేవి హాస్టల్‌ను పరిశీలించడానికి వచ్చిన రిజిస్ట్రార్ మల్లారెడ్డిని నిలదిశారు. హాస్టళ్లను ఎవరూ పట్టించుకోవడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనతో వాగ్వాదానికి దిగారు. రిజిస్ట్రార్ గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. కాగా, గత నెల 29న వర్సిటీ క్యాంపస్‌లోని ఉమెన్స్ హాస్టల్‌లో సీలింగ్ ఫ్యాన్ ఊడిపడటంతో పీజీ ఫస్ట్ ఇయర్ చదువుతున్న లూనావత్ సంధ్య తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఫ్యాన్ విరీదపడంతో ఆమె తలకు తీవ్ర గాయమైంది. తోటి విద్యార్థులు వెంటనే ఆమెను దవాఖానకు తరలించారు. ఈ క్రమంలో హాస్టల్‌లోని ఓ గదిలో పైకప్పు పెచ్చులు ఊడిపడడం ఆందోళన కలిగిస్తోంది.




## రోడ్డు మరమ్మతులకు శ్రీకారం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారులు గుంతల మయంగా మారి వాహనదారులకు పరీక్ష పెడుతున్నాయి. గత కొంత కాలంగా హనుమకొండ బస్టాండ్ రహదారి అధ్వాహ్నంగా మారి ప్రమాదాలకు నిలయంగా మారింది. దీంతో వివిధ మాధ్యమాల్లో వరుస కథనాలు రావడంతో అధికారులు స్పందించారు. శుక్రవారం రాత్రి రోడ్డు మరమ్మత్తు పనులను ప్రారంభించారు. బస్టాండ్ లోపల, బయట ఉన్న గుంతలను పూడ్చేందుకు సిద్ధపడ్డారు. దీంతో హనుమకొండ బస్టాండ్ నుంచి అశోక జంక్షన్ వరకు బారికేడ్లు ఏర్పాటు చేసి మరమ్మతులు చేపట్టారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com